క్లుప్తంగా

బిత్రపాడు పాఠశాల తనిఖీ



బిత్రపాడు పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ నాగభూషణరావు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బాసంగి ఎంపీయూపీ పాఠశాలలను ఇన్‌చార్జి ఎంఈఓ ఎన్.నాగభూషణరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికపై సూచనలు చేశారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.గాయత్రీ, సీఆర్పీ సోమేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

దిశ యాప్‌పై విద్యార్థినులకు అవగాహన



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ హర్షిత చంద్ర

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాలలో దిశ యాప్‌పై దిశ సెల్ డీఎస్పీ హర్షిత చంద్ర విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అలాగే ఫోక్సో చట్టం, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



సత్యంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దు మురళి తండ్రి సత్యంను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు సత్యం గత కొన్ని రోజుల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందిస్తామని ఎమ్మెల్యే దంపతులు ఎద్దు మురళికి భరోసానిచ్చారు. వీరి వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య తదితరులున్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్యలపై ఎమ్మెల్యే వినతి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: విద్యారంగ సమస్యలపై సీతంపేట పీఎంఆర్‌సీ వద్ద ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కలిసి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో, విద్యార్థులు అధికంగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఫొటోలు అప్‌లోడ్ పనులకు ఆ గ్రామానికి చెందిన వలంటీర్‌కు, వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అప్పగించాలన్నారు. తద్వారా ఉపాధ్యాయులపై పనిభారం తగ్గేలా చూడాలని కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కుక్‌లు, కమాటీలను, హెల్త్ వలంటీర్‌లను నియమించాలన్నారు. సవర భాష వలంటీర్‌లను రెన్యువల్ చేయాలని కోరారు. మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించారు. సీతంపేట ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాలకు డైనింగ్ హాల్, మనుమకొండకు నూతన భవన సదుపాయం, పోస్టు మెట్రిక్ హాస్టల్‌కు అదనపు భవనాలు నిర్మించాలని ఎమ్మెల్యే కళావతి కోరారు. సమస్యలను విన్న ఆయన సానుకూలంగా స్పందించారు.

బస్ షెల్టర్‌లో వ్యక్తి మృతి

పాలకొండ రూరల్: పాలకొండ – వీరఘట్టం రహదారిలోని బస్ షెల్టర్లో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం గుర్తించారు. తొలిత ఆచూకీ తెలియని మృతదేహంగా భావించిన పోలీసులు మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తరువాత మృతి చెందిన వ్యక్తి పొందూరు మండలం గారపేటకు చెందిన ఎం.చిన్నరాజుగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశామని ఎస్‌ఐ శివప్రసాద్ పేర్కొన్నారు.

జగనన్న పథకాలతో నవశకం

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- పెదరామలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పథకాల గూర్చి వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్న పథకాలతో రాష్ట్రంలో నవశకం ప్రారంభమైందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని పేర్కొన్నారు. మండలంలోని పెదరామ గ్రామ సచివాలయ పరిధిలో నౌగూడ, చింతమానుగూడ, కోసిమానుగూడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు గిరిజన మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే చేరుతుండడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే 95శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లకుండానే సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అర్హులందరికీ అందుతున్నాయని చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. దీన్ని ప్రజలంతా గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలన్నారు. అంతకముందు గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలిచ్చారు. సమస్యలపై ఫిర్యాదులుంటే తక్షణం స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ తిరుపతిరావు, పార్టీ నాయకులు మూటక రామారావు, నిమ్మక కాంతారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తోటపల్లి దేవస్థానం ట్రస్టు కేలండర్ విడుదల



తోటపల్లి దేవస్థానం ట్రస్ట్ కేలండర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగిలో తోటపల్లి దేవస్థానం ట్రస్ట్ కేలండర్‌ను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శుక్రవారం విడుదల చేశారు. అంతేకాకుండా సభ్యత్వం కింద రూ.11,116లు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవాల కన్నయ్య, డి.ధనుంజయరావు, మధుసూధనరావు ఉన్నారు.

ఈదురు గాలులతో బెంబేలు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా శుక్రవారం వేకువ జామున వీచిన ఈదురుగాలులతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఈదురు గాలులతో వాతావరణం చల్లబడినప్పటికీ రోడ్లపై ధూళి రేగడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం 6.45 గంటల నుంచి 9 గంటల వరకు గాలులు వీయడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలు తెల్లారేసరికి అవస్థలు పడ్డారు. కొంత సేపటికి గాలులు తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ పునరుద్ధరించడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న ఎస్ఈబీ అధికారులు

పాలకొండ: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలు శుక్రవారం వేలం నిర్వహించారు. మొత్తం 18 వాహనాలను వేలం నిర్వహించగా 7 వాహనాల మాత్రమే వేలం పాటలో పాడుకున్నారని ఎస్ఈబీ సీఐ గోపాలకృష్ణ తెలిపారు. 7 వాహనాలకుగాను రూ.1,01,830 ఆదాయం వచ్చినట్లు వివరించారు.

గృహ నిర్మాణాలకు గ్రేడ్ – 1 సిమెంట్



గోదాంలో ఉన్న సిమెంటు బస్తాలను లెక్కిస్తున్న హౌసింగ్ ఈఈ

వీరఘట్టం: గృహ నిర్మాణ లబ్ధిదారులకు గ్రేడ్ – 1 రకం సిమెంట్‌ను అందజేస్తున్నామని హౌసింగ్ ఈఈ సోమేశ్వరరావు పేర్కొన్నారు. వీరఘట్టంలో హౌసింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఉన్న సిమెంట్ గోదాంను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్ పథకం కింద హౌసింగ్ లబ్ధిదారులకు ఈ సిమెంట్‌ను అందజేస్తున్నామన్నారు. ఇంతవరకు వీరఘట్టం మండలంలోని లబ్ధిదారులకు 3,117 బస్తాల సిమెంట్ అందజేశామన్నారు. ఇంకా గోదాంలో 365 బస్తాల సిమెంట్ నిల్వ ఉందన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ వి.వినోద్ ఉన్నారు.

ట్యాబ్ బోధన భేష్



విద్యార్థుల ట్యాబ్ బోధన పరిశీలిస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ట్యాబ్ బోధన బాగుందని ఆర్‌జేడీ జ్యోతికుమారి అన్నారు. శుక్రవారం పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. 8వ తరగతి విద్యార్థులతో బైజూస్ కంటెంట్‌పై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ సబ్జెక్టు పర్సంటేజీలు, పాఠ్యాంశాలైన తర్వాత యాప్‌లో ప్రాక్టీస్ టెస్ట్‌లు రాసే విధానాలను అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్ బోధనలో మరింత మెలకువలు నేర్చుకొని ఉన్నతంగా అభ్యసించాలని ఆమె సూచించారు. ఇందుకు ఉపాధ్యాయులు కూడా సహకరించాలని సూచించారు. ఆమె వెంట ఉప విద్యా శాఖాధికారి విజయకుమారి, హెచ్ఎం ఎ.లిల్లీరాణి తదితరులు ఉన్నారు.

సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేయాలి



మస్తరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజావసరాలకు ఉపయోగ పడే అభివృద్ధి పనులు చేపట్టి వేతనదారులకు గిట్టుబాటు వేతనం వచ్చేలా చూసుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం లచ్చయ్యపేటలో జరుగుతున్న పనులను, వేతనదారుల మస్తరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున ఎండ బారిన పడకుండా ఉదయాన్నే పనుల్లోకి వచ్చేలా వేతనదారులకు క్షేత్ర సహాయకులు అవగాహన కల్పించాలని సూచించారు. పనిచేయాల్సిన చోట మార్కింగ్ విధానం అవలంబించి, ఇచ్చిన మార్కింగ్‌లోనే నిర్దేశించిన గడువులోగా పని పూర్తి చేసుకుని ఇంటికి చేరుకునే విధంగా తెలియ జేయాలన్నారు. వేతనం గిట్టుబాటయ్యే విధంగా సాంకేతిక సహాయకులు చూడాలని స్పష్టం చేశారు. పని చేసినచోట టెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలని, నీడనిచ్చే చెట్లున్నచోట పనులు జరిగేలా చూడాలని, తాగునీరు విధిగా చల్లని నీడలో ఉండేలా చూడాలని సూచించారు.

సస్పెన్షన్‌ను ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీలో 8వ తరగతి విద్యార్థులకు గణితం పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదనే కారణంగా జిల్లా, మండల విద్యాశాఖాధికారులను,కేజీబీవీ ఎస్ఓ, జీసీడీఓలను బాధ్యులను చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సస్పెన్షన్ విధించడాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి.ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వీరఘట్టం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. వీరఘట్టం కేజీబీవీకి శ్రీకాకుళం జిల్లానుంచి పాఠ్యపుస్తకాల కోసం ప్రతిపాదనలు చేసి పంపిణీ చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి పంపిణీ అయిన పుస్తకాలకు పార్వతీపురం మన్యం జిల్లా అధికారులను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

సీఎం జగనన్న పథకాలకు ప్రజా మద్దతు

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ప్రజా మద్దతు పుష్కలంగా ఉందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇంటింటికి జగనన్న స్టిక్కర్లు అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



కురుపాం: ఊసకొండ పంచాయతీ దంగులగూడ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలపై సంక్షేమ పథకాలపై వివరిస్తున్న వైస్ ఎంపీపీ అన్నాజీరావు



భామిని: సింగిడిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి తదితరులు



భామిని: సింగిడిలో వ్యాపారులు, మిల్లర్లతో జగనన్నకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే కళావతి

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న నేత్రవైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు

కురుపాం: మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలికల, బాలురుకు కళ్లజోళ్లను పంపిణీ చేసినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టి దోషం ఉన్న 42 మంది విద్యార్థులను గుర్తించి వారికి కళ్లజోళ్లను పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. అలాగే కంటి వ్యాధులు, నేత్రదానంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణారావు, ఆరోగ్య పర్యవేక్షకులు సత్యరాజ్, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గణిత పాఠ్యపుస్తకాల పంపిణీ



గణిత పాఠ్యపుస్తకాలతో కేజీబీవీ 8వ తరగతి బాలికలు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీలో 8వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ముగుస్తున్నా గణిత పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంపై విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందిస్తూ శుక్రవారం కేజీబీవీ 8వ తరగతి విద్యార్థినులకు గణిత పాఠ్యపుస్తకాలను హుటాహుటీనా అందజేశారు. ఇక మీదట విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలను అందజేస్తామని నేషనల్ టెక్స్ బుక్స్ సరఫరా చేసే సభ్యులు తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జీసీసీ డీఎం మహేంద్రకుమార్



సేల్స్‌మేన్లు, డీలర్లకు సూచనలు చేస్తున్న డీఎం మహేంద్ర కుమార్

గుమ్మలక్ష్మీపురం: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయం వద్ద సేల్స్‌మేన్లు, డీలర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన అటవీ ఫలసాయాల కొనుగోలు, డీఆర్ఎస్ అమ్మకాల లక్ష్యాలు, అచీవ్‌మెంట్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా రోజూ డీఆర్ డిపోలు తెరవాలని, ప్రజా పంపిణీ సకాలంలో నిర్వహించాలని, ప్రజలకు, అధికారులకు జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. అటవీ ఫలసాయాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట బీఎం కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, డీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎం.సాంబమూర్తి ఉన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ



నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్ మండల ఇన్‌చార్జి ఆర్.పురుషోత్తం ఆధ్వర్యంలో శుక్రవారం నవధాన్యాల సాగుపై మహిళ రైతులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ అడ్డాకుల కుసుమమ్మ మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, తద్వారా వేసిన పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. నవధాన్యాల సాగుతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని, రైతులంతా నవధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీలు కిల్లక వెంకటేష్, ఎం.పరశురాం, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి' : పీడీ



విక్రంపురంలో గొయ్యి బంద పని పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు

కొమరాడ: గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పిస్తున్నామని జాతీయ ఉపాధి హామీ పథకం పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురం, గంగారేగువలస, విక్రంపురంలో జరుగుతున్న పని ప్రదేశాల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం వేతనదారులు మస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని జరుగుతున్న ప్రదేశాల్లో కచ్చితంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఎండల ఎక్కువగా ఉన్నందున వేతనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామ వలంటీర్ల దగ్గర ఉన్న ఇళ్ల ప్రకారం అన్ని కుటుంబాలకు జాబ్ కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. వేతనదారులు అంతా కొలతల ప్రకారం పని చేసి గిట్టుబాటు వేతనం పొందాలన్నారు. ఆయన వెంట ఏపీఓ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



గరుగుబిల్లిలో కుండీలో నీటి నిల్వలను తొలగిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో ఎర్రన్నగుడి జంక్షన్‌లో ఫ్రైడే డ్రైడే సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని లేకుంటే వ్యాధులకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాభివృద్ధి



కొండాపురంలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

పాలకొండ: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామ అభివృద్ధి సాధ్యమని కొండాపురం గ్రామ సర్పంచ్ రాయి వనజ తెలిపారు. శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం చేపడుతున్న కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శి సీతారాం వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరణం నారాయరణరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శాసుబిల్లి జనార్దన్‌రావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంట నష్టాల గుర్తింపును పరిశీలించిన ఎమ్మెల్యే

భామిని



పంట నష్టాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి

మండలంలోని పక్కుడుబద్ర వద్ద తిష్ట వేసిన ఆరు ఏనుగుల గుంపు కలిగిస్తున్న పంట నష్టాలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం పరిశీలించారు. కాట్రగడ – బి.బొమ్మిక, పక్కుడుబద్ర, కొత్తూరుగూడ ప్రాంతాల్లో ఏనుగుల గుంపు చేస్తున్న విధ్వంసాన్ని స్వయంగా చూశారు. జీడి తోటలు, మామిడి తోటలు, వరి పంట పొలాలకు కలుగుతున్న నష్టాలను చూశారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ముందుగా ఇటీవల భామిని ఎఫ్‌సీఐ గోదాంలో ఆకస్మికంగా మరణించిన కళాసీ ఆనంద్‌గౌడ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కళావతి, పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి తగిన సాయం అందజేస్తామని భరోసానిచ్చారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు పంట నష్టాల గుర్తింపుపై సూచనలు చేశారు. వీఆర్ఓ సీహెచ్ భారతి, కార్యదర్శి కె.సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.